విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 23 మే 2024 8 పేజీలు

పోలింగ్ సరళిపై 'చెవిరెడ్డి'
ఫోకస్

- బూత్‌ల వారీగా సర్వే చేస్తున్న చెవిరెడ్డి బృందం
- జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే
- క్రాస్ ఓటింగ్‌పై టెన్షన్..టెన్షన్..
- గెలుపుపై భయంతోనా... ధీమా తోనా...
- జిల్లాలో అనుచరుల ప్రత్యేక సర్వేలు
- రెండు రోజుల్లో పూర్తయ్యే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్‌శాతం పెరిగింది. ప్రత్యేకంగా ప్రకాశం జిల్లాలో 2014, 2019 ఎన్నికలతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో 87.37 శాతం జరిగింది. రాష్ట్రంలో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 91 శాతం నమోదైంది. ఒంగోలుతో పాటు అన్ని నియోజకవర్గాల్లో బూతుల వారీగా పరిశీలిస్తే 90 శాతంకు పైగా దాదాపు 400పైగా బూతుల్లో పోలింగ్‌శాతం నమోదైంది. దీంతో గెలుపుపై ఎవరి ధీమా వారు పోటీ చేస్తున్న అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల అందరిలో ఆందోళన లేకపోలేదు. ఇప్పటికే తెలుగుదేశం, వైకాపా పార్టీల నేతలు రకరకాల సర్వేలు చేయించుకున్నారు. తాజాగా వైసీపీ నుంచి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 750 మంది చేత పోలింగ్ శాతంపై ప్రత్యేక సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తుంది. వైసీపీ అధినేత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వై నాట్ 175 అని పదేపదే గంటాపదంగా చెబుతున్నారు. దీంతో వై నాట్ 175 వస్తాయా లేదా వైసీపీకి ఎన్ని సీట్లు రావచ్చు, ఎన్ని ఎంపీ సీట్లు రావచ్చు అనే దానిపై చెవిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా వారి అనుచరులు సర్వేలో నిమగ్నమయ్యారు. ఒంగోలు నుంచి చెవిరెడ్డి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడంతో ప్రకాశం జిల్లాపై ప్రత్యేక పోకస్ పెట్టినట్లు సమాచారం. ఒంగోలు, దర్శి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, కొండేపి

మిగతా 2 లో...

స్ట్రాంగ్ రూముల తనిఖీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ బుధవారం ఒంగోలు శివారులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఈ.వి.ఎం.లను ఇందులో భద్రపరచిన స్ట్రాంగ్ రూములను ఆయన తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూములకు వేసిన సీలును, భద్రత, సి.సి.టి.వి.ల నిఘాను పరిశీలించారు. ఈ ప్రాంగణం మొత్తాన్నీ సి.సి. టి.వి. పర్యవేక్షణలో ఉంచామన్నారు. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట గడువులోగా ఈ పనులు పూర్తయ్యేలా అవసరమైతే కూలీలను పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఒంగోలు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ జి.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

పేదలకు అందని 'ఆరోగ్య శ్రీ సేవలు' 3 లో..

నేర నియంత్రణే లక్ష్యంగా
కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల కౌంటింగ్ రోజున, అనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు.బుధవారం ఉదయం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్, చీరాల-2 టౌన్ పోలీస్ స్టేషన్, వేటపాలెం,అద్దంకి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. బాపట్ల డిఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో,బాపట్ల రూరల్ ఇన్స్పెక్టర్ వై.శ్రీహరి,బాపట్ల టౌన్ సీఐ యు.శ్రీనివాసులు,బాపట్ల రూరల్ సీఐ బి.హజరత్ బాబులు, సిబ్బంది,ఏపీఎస్పీ బలగాలతో బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఘర్షణలు చోటుచేసుకున్న వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో

మిగతా 2 లో...

అత్యంత పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులు, ఏ ఆర్ ఓ లకు అవగాహన కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది.ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సమర్థతతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈసీఐ సూచించిన మార్గదర్శకాలను విస్మరించరాదన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 12కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ కొరకు మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఒక రౌండ్ లో 14 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు లెక్కించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు సైతం లోపలికి అనుమతించరాదన్నారు. నాలుగు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వారికి మార్గనిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన విధి నిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా అన్నారు. లెక్కింపు కేంద్రంలో గొడవలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈనెల 28వ తేదీన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 30వ తేదీన ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణలు ఉంటాయన్నారు. మూడో తేదీన రెండో దశ శిక్షణ ఇవ్వాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని ఆయన పలు సూచనలు చేశారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని ఆర్ ఓ లను జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలపై పిపిటీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

నరసింహస్వామి జయంతి

విశాలాంధ్ర-చీమకుర్తి : శ్రీ నరసింహస్వామి జయంతి పర్వదిన సందర్భంగా చీమకుర్తిలోని రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి వారి ప్రాంగణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు పరాంకుశం కృష్ణ సాయి భట్టా చార్యులు చే సహస్రాధిక వివిధ స్తోత్ర పారాయణ మహా యజ్ఞం పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. తదనంతరం నరసింహ స్వామి వైభవం గూర్చి ప్రవచనాలు చెప్పడం జరిగింది. నిర్వాహకుల ఆహ్వానం మేరకు అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మరియు మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకటరెడ్డి పుణ్య దంపతులు వారు పాల్గొని దేవుని ఆశీస్సులు తీసుకున్నారు.

కార్డెన్ సెర్చ్ కేవలం నేరాలు నియంత్రణకే

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమ గుర్తులు నేరాలు నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు చీమకుర్తి పట్టణ సిఐ దుర్గాప్రసాద్ తెలియజేశారు. జిల్లా ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు చీమకుర్తి పట్టణంలో పోలీసులతో కార్డన్స్ సెర్చ్ నిర్వహించామని సరైన పత్రాలు లేని 36 బైకులు స్వాధ్యం చేసుకున్నామని అన్నారు. జూన్ 4వ తారీఖు నిర్వహించి పోయే కౌంటింగ్ ప్రక్రియలు ఎటువంటి ర్యాలీలు ప్రదర్శనలు చేయడానికి వీలులేదని అన్నారు.

విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర-మార్కాపురం : గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. విద్యార్థులచే కథలు చెప్పించడం, పుస్తక ములు చదివించడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం నేర్పించడం జరిగింది. సాధన డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎం శేషు కుమార్ విద్యార్థులకు గణితంలో మెలుకువలు, ఏకాగ్రత గురించి, న్యూటన్ పెండ్యులం గురించి సమగ్రంగా వివరించారు. 15 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయం శాఖ గ్రేడ్-1 గ్రంథపాలకులు జివి శివారెడ్డి తెలిపారు.

హర హర.. చెన్నకేశవా..

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చిన్నగొల్లపల్లి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి తిరునాళ్ల వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సాగుతుంది. నాగులేటి

ఒడ్డున కాలువపై ఉన్న శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక దినోత్సవాలు భాగంగా మండల పరిధిలోని చిన్న గొల్లపల్లి గ్రామంలో బుధవారం కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు హనుమంతునిపాడు మండల ఎస్సై పులి శివ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొని దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదులు స్వీకరించారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-టంగుటూరు : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వ నిర్ణయించిన కనీస వసతులన్నీ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బాపూజీ కాలనీ, రాయవారి పాలెం చెరువు తదితర ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పనిప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు ఎండలు తీవ్రంగా పెరుగుతున్నాయని, మజ్జిగ, మంచినీళ్ల, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ లాంటివి ఏర్పాటు చేయాలని కోరారు. నీడకు పట్టలు, ప్రథమ చికిత్స పెట్టెను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం రోజు వేతనం 300 ప్రకటించగా 220 లోపు మాత్రమే వస్తున్నాయని, పెరుగుతున్న ధరలతో చాలీ చాలని ఈ వేతనాలతో ఎలా బ్రతకాలో అర్థం కావట్లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు విన్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 600లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాల ముందు డిమాండ్ పెట్టిందని తెలిపారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పినా ఆచరణలో అమలు జరగటం లేదని ఈ సమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల ఫలితంగా గ్రామీణ పేదలకు పని దినాలు క్రమంగా తగ్గిపోతున్నాయని, పట్టణాలకు వలస పోయినా భవన నిర్మాణ పనులు కూడా తగినంతగా లేవని అన్నారు. ఏ బ్రతుకు తెరువు లేని వారి జీవితం ఆందోళనకరంగా మారుతున్నదని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అధికారంలోకి రానున్న ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచి పేదల జీవితాన్ని కాపాడాలని కోరారు. పని ప్రదేశాల పరిశీలనకు ఉపాధి హామీ అధికారులు ఏపిడి వెంకటస్వామి, ఏపీఓ సుభాషిని కూలీల వద్దకు రాగా వ్యవసాయ కార్మిక సంఘం బృందం కూలీల సమస్యలను వాళ్ళదృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నిర్ణయించిన మౌలిక వసతులన్నీ కల్పిస్తామని, రోజు వేతనం 300 వచ్చేలా ప్రయత్నం చేస్తామని వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి టంగుటూరి రాము, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి. మోజస్ పాల్గొన్నారు.

గొడవలు సృష్టించుకోవద్దు : ఎస్ఐ

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక బస్టాండ్ సెంటర్లో సీతాలమ్మ గుడి వద్ద ద్విచక్ర వాహనదారులతో, గ్రామ ప్రజలతో తర్లుపాడు మండల ఎస్సై వేము సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఎన్నికల సమయంలోనూ, ఎన్నికల అనంతరం జరిగిన పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ పోలీస్ శాఖ వారు ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనాలను, వాహనదారులు నడిపేటప్పుడు చట్టపరమైన వాటికి సంబంధించిన కాగితాలన్నింటిని సంబంధిత అధికారుల విచారణలో తప్పనిసరిగా చూపించాలన్నారు. రోడ్లపై ఎక్కడ భడితే అక్కడ వాహనాలను నిలుపురాదన్నారు. గుంపులు గుంపులుగా ఉండి ముచ్చటించరాదన్నారు. ఎవరి పనులలో వారు నిమగ్నమై ఉండాలన్నారు. వాహనదారులు నియమ నిబంధనలు పాటించని యెడల వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎవరు సిఫారసులు అనుమతించబడవు అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో గతంతో పోల్చుకుంటే ఓటింగ్‌శాతం బాగా పెరిగింది. అందులోను మహిళలు అధికశాతం ఓటు హక్కును వినియోగించు కున్నారు. జిల్లాకు చెందిన అనేక మంది జీవనోపాధి కోసం హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విశాఖ పట్నంతో పాటు ఎన్ఆర్ఐ ఓటర్లు అత్యధికంగా ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీకి చెందిన అభ్యర్థులు ఒంగోలు, దర్శి నియోజకవర్గంలో ఓటుకు మూడు వేలు, బియ్యం బస్తాలతో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురంలో ఓటుకు రెండు వేలు, కనిగిరిలో ఓటుకు 1500, కొండేపిలో ఓటుకు 2వేల చొప్పున పంపిణీ చేశారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థులు ఒంగోలులో దామచర్ల జనార్ధన్ 2వేలు పంపిణీ చేయగా మిగిలిన నియోజకవర్గాల్లో వైసీపీ కన్నా 500 తక్కువగా ఓటుకు పంపిణీ చేశారు. దీంతో పాటు మద్యం ఏరులై పారింది. చిన్న చిన్న ఘటనలు మినహాయిస్తే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు ఉదయం ఆరున్నర గంటల నుంచి క్యూ లైన్‌లో బారులు తీరారు. వీటన్నింటిని గమనిస్తే గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం పేరుతో బటన్ నొక్కి మహిళల అకౌంట్‌లకు డబ్బులు వేయడం ద్వారా ఓటింగ్‌శాతం పెరిగి వైసీపీకి సానుకూలంగా ఉందా లేక రాష్ట్రానికి రాజధాని లేక పోలవరం ప్రాజెక్టు పూర్తికాక విశాఖపట్నం రైల్వేజోన్ సాధించడంలో వైఫల్యం చెంది, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడటం కారణం ప్రభుత్వమేనని వ్యతిరేక ఓటు పడిందా అనేది ఆ పార్టీలో అంతర్గతంగా వినిపిస్తున్న ప్రశ్నలు. మరోపక్క తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల ప్రకటన, అమరావతి రాజధాని నిర్మాణం మరోసారి స్పష్టం చేయడంతో పాటు రైతులకు మహిళలకు వివిధ రూపాల్లో సంక్షేమ పథకాలు మెరుగ్గా మ్యానిఫెస్టోలో పెట్టి ప్రకటించడం వలన ఓటింగ్‌శాతం పెరిగిందా ఇలా రకరకాల వాదనలు ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన అనుచరులతో ప్రత్యేక సర్వేకి తెర తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 750 మంది పోలింగ్ సరళిపై సర్వే చేయిస్తుండగా ప్రకాశం జిల్లాలో మరింత లోతుగా సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. అయితే చెవిరెడ్డి నాన్ లోకల్ కావడం, మాగుంట గత 35 సంవత్సరాల నుంచి ఒంగోలులో ఉంటూ ప్రకాశం జిల్లా ప్రజల్లో ఒకరిగా మారిన నేపథ్యంలో ఓటర్లు మాగుంటకే మొగ్గు చూపి క్రాస్ ఓటింగ్ వేసినట్లు ప్రచారం జరుగుతుంది. నిజంగా క్రాస్ ఓటింగ్ పడిందా లేదా అనే దానిపై చెవిరెడ్డిలో టెన్షన్ నెలకొంది. దీంతో లోతైన సర్వేకి జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.

నేర నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్

(మొదటిపేజీ తరువాయి)

కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలో ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఘర్షణలకు పాల్పడడం హింసను ప్రేరేపించడం తగదన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజు,ఆతరువాత జిల్లాలో కొన్ని ప్రాంతాలలో చెదురు మొదురు ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేశామని తెలిపారు. జూన్ 4 వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు,ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సమస్యాత్మక ప్రాంతాలు,గ్రామాలలో పోలీస్ అధికారులు,సిబ్బంది,ప్రత్యేక పోలీసు బలగాలతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు.ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడేందుకు ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఎవరైనా నివాసం ఉంటున్నారా,హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ఆయుధాలు,కర్రలు ఇతర వస్తువులు ఎవరైనా కలిగివున్నారా, పెట్రోల్,డీజిల్ వంటి వాటిని ఎవరైనా నిలువ ఉంచారా,నేరాలకు పాల్పడడానికి పత్రాలు లేని వాహనాలను ఎవరైనా కలిగి వున్నారా వంటి విషయాలను తెలుసుకొని ముందుగానే ఘర్షణలను నివారించడానికి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు తరచూ వివాదాలకు పాల్పడే వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని, ఎవరైనా పోలీస్ శాఖ ఆదేశాలను పెడచెవిన పెట్టి ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

గతంలో బైండోవర్ చెయ్యబడిన వ్యక్తులు ఏవైనా అవాంఛనీయ ఘటనలలో పాల్గొంటే, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు నిందితులకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా గొడవలకు, ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్నదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉంటుందని తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గాని, డయల్ 100/112లకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

పేదలకు అందని 'ఆరోగ్య శ్రీ సేవలు'

- రోగులను పంపించేస్తున్న ఆసుపత్రులు
- నిధులు ఇవ్వక రూ.కోట్లల్లో బకాయిలు
- ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసిన ప్రైవేట్ ఆస్పత్రులు
- జిల్లాలో రూ.50 కోట్ల బకాయిలు నిలిపివేత

విశాలాంధ్ర-కనిగిరి : పామూరుకు చెందిన గుత్తి రమణయ్య పాడి గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గుండె సంబంధిత వ్యాధితో ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో చికిత్స కోసం నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద సేవలు అందించడం లేదని సిబ్బంది తెలిపారు .విధిలేని పరిస్థితుల్లో ఆర్థిక భారమైనప్పటికీ రూ. 50 వేలు సొంత నగదు వెచ్చించి చికిత్సలు చేయించుకున్నారు.

పీసీపల్లి మండలంలోని చెరుకూరి వారి పల్లికి చెందిన నర్సమ్మ అనే వృద్ధురాలు ఏడాది ఫిబ్రవరిలో ప్రమాదవశాత్తు కింద పడటంతో కాలు విరిగింది. చికిత్స కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రభుత్వం నుంచి 18 కోట్లకు పైగా బకాయిలు ఉన్నందున తమ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా సేవలను అందించలేమని డబ్బు కట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే వేరే ఆసుపత్రికి వెళ్లి పోవాలని తేల్చి చెప్పారు. సొంత డబ్బులు ఖర్చు చేసి అవసరాలు వైద్య సేవలు పొందింది.

సిఎస్పురం మండలం వెంగనగుంట గ్రామానికి చెందిన కుదారి కొండయ్య ఏడాది జనవరిలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్త ఒంగోలులో ఆరోగ్యశ్రీ సేవలందించే ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి కోట్లలో బకాయిలు రావాల్సి ఉందన్న తమ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందించలేమని చెల్లిస్తే చేస్తామని తెలిపారు. దీంతో రూ.3.60 లక్షలు పైగా చెల్లించి వైద్య సేవలు చేయించుకున్నాడు.

కనిగిరికి చెందిన తోపుడు బండి నడుపుకొని జీవనం సాగించే రమణయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వైద్య సేవలు కోసం ఒంగోలు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్ళగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించలేమని సొంత ఖర్చుతో వైద్య సేవలు పొందాలని చెప్పడంతో చికిత్స చేయించుకుంటానే ఇంటికి తిరిగి రావడం జరిగింది. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు 9 ,53, 701 బీహెచ్ఎస్ కార్డుదారులు 66,351, స్మార్ట్ కార్డు పింఛన్దారులు 19,354 జిల్లాలోని నెట్ ఆసుపత్రులు 127 అందులో ప్రభుత్వంలో 77 ప్రైవేటు కార్పొరేట్ వి 38, ఈ హెచ్ ఎస్ దంత వైద్యశాలలు 12 సేవలకు ఇవ్వవలసిన బకాయిలు రూ. 50 కోట్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేద, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఆసుపత్రిలకు పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం చొరవ పోవటం వల్ల ఆసుపత్రిలు వైద్య సేవలు ఆపివేశారు. దీంతో పేదలకు అందవలసిన ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోయాయి. గత ఏడాది ఆగస్టు నుంచి జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు రూ. 50 కోట్లు బిల్లులను చెల్లించలేదని ఆస్పత్రి వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీంతోపాటుగా కోవిడ్ 19 కింద అందించిన చికిత్స బిల్లులు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లింపులు సుమారు మూడేళ్ల నుంచి ప్రభుత్వం చెల్లించడం లేదని బకాయిలు చెల్లించే వరకు ఆరోగ్యశ్రీ సేవలు అందించేది లేదని తేల్చి చెప్పడం జరుగింది. పెండింగ్ బిల్లులు చెల్లింపు పై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన విఫలమయ్యాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ పథకం కింద 50శాతం మందు ఖర్చుల వరకు పూర్తిగా భరించేందుకు ముందుకు వచ్చే వారికి వైద్యాన్ని అందిస్తాం. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో 50శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఏదేమైనా ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి ఆరోగ్యశ్రీ బకాయిలను ఆస్పత్రులకు సత్వరమే చెల్లించి పేదలకు అందించాల్సిన మెరుగైన వైద్య సేవలు అందించాలని పేదల కోరుతున్నారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర-దొనకొండ: దర్శి డీఎస్పీ టి.అశోక్వర్ధన్ ఆదేశాల మేరకు సీఐ సుబ్బారావు, ఎస్ఐ సంపత్కుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సిబ్బంది విస్తృత తనిఖీలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలో అల్లర్లు జరగకుండా చూసేందుకు ప్రతి ఇంటిని జల్లెడ పడుతున్నట్లు తెలిపారు. ఎవరైనా తమ ఇంటిలో మారణాయుధాలు కలిగి ఉండటం చట్టరిత్యా నేరమన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో విజయోత్సవాలు చేసుకోవటం నిషేదమని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అనుమతి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని, సంబంధిత పత్రాలను చూపిన వారికి వాహనాలు ఇస్తామని, లేని పక్షాన కేసు నమోదు చేస్తామన్నారు. మే 13 ఎన్నికల రోజు ఎలాంటి అల్లర్లకు తావు ఇవ్వకుండా సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు రోజు సహకరించాలని ప్రజలను కోరారు. వారి వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవుల నీటి సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మూగ జీవాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని, సబ్సిడీపై దాణా సప్లై చేయాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు చేశారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల, రాళ్లపల్లి ,వెదుళ్ళ చెరువు, కమ్మ పాడు, జాల పాలెం, పందువ, తదితర గ్రామాలలో పర్యటించి గొర్ల కాపరుల సమస్యలు పరిశీలించడం జరిగింది. మండలంలో వేలాది జీ వాలు వందలాది కుటుంబాల ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా వర్షాలు సరిగా లేక తీవ్రమైన ఎండల వలన చెరువులు కుంటలు ఎండిపోయి గొర్రెలకు తాగనీరుఎక్కడ అందుబాటులో లేదని, మేత సమస్య తీవ్రంగా ఉన్నందున సుదూర ప్రాంతాలైన, కందుకూరు ప్రాంతానికి వలసలు పోతున్నామని తెలిపారు అక్కడ కూడా వర్షాలు లేక మేత దొరకడం లేదని వారు పోషకదారులు వారి దృష్టికి తీసుకువచ్చారు, ఒకవైపు నీళ్లు మరోవైపు మేత లేక గొర్రెలు బక్క చెక్కిపోతున్నాయని కాపర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవాల వలసల నివారణ కోసం సబ్సిడీ పై దాణా సప్లై చేయాలని, ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి తోట్లు కట్టించాలని ,బోర్లు పడని పక్షంలో ట్యాంకర్లుద్వారా నీటితోట్లు నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలని వాటిని కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండే బాలకృష్ణ స్థానిక కాపర్లు పెరుగు వెంకటరావు, తిరుపాలు కడెం లక్ష్మయ్య, అరవ నాగయ్య పాల్గొన్నారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాళ్ల మహోత్సవాలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చిన్నగొల్లపల్లి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి తిరునాళ్ల వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సాగుతుంది. నాగులేటి ఒడ్డున కాలువపై ఉన్న శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక దినోత్సవాలు భాగంగా మండల పరిధిలోని చిన్న గొల్లపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి వారి దంపతులు రజని, వారి కుమారుడు సాయి భరత్ రెడ్డి వారి కుమార్తె సరితారెడ్డి పాల్గొని దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదంలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, సూరపురెడ్డి రామలింగారెడ్డి, సుమిత్ర తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర-టంగుటూరు : శాఖ గ్రంథాలయం టంగుటూరు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈరోజు విద్యార్థులకు పుస్తకాలు చదవడం వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించామని శాఖా గ్రంథాలయ నిర్వహకులు, గుమ్మడి వర్ధన్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యాసరచన వకృత్వం వంటి పోటీలు ద్వారా పిల్లల్లో ఉన్న నైపుణ్యతను వెలుగు తీయడానికి దోహదపడతాయని అన్నారు. టంగుటూరు పరిసర ప్రాంతాలలో తల్లి దండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపించాలని కోరారు.

అతివేగంతో లారీ, వ్యాన్ ఢీ

ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణంలోని డిగ్రీ కాలేజ్ వద్ద వద్ద బుధవారం ఉదయం అతివేగంగా ఎదురు ఎదురుగా వస్తున్న మినీలారీ, వ్యాన్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన జరిగింది. వివరాల్లోకెళ్తే మాచవరం గ్రామం నుంచి కనిగిరి వైపుకు ఇంటికి స్లాబ్ వేసే సామాగ్రితో పాటు కూలీలతో లారీలో వస్తుండగా కనిగిరి నుంచి పామూరు వైపు వెళ్లే వ్యాన్ అతివేగంగా ఢీకొనడంతో లారీ వెనుక చక్రాలు ఊడి పల్టీల కొట్టడం జరిగింది. ఈ క్రమంలో బెల్దార్ కూలీలైన ఉప్పు రమాదేవి (45) తీవ్ర గాయాలు కాగా సుశీల, జయలక్ష్మికి తల, కాళ్లు, చేతులకు గాయాలైనాయి. ఉప్పు రమాదేవిని కనిగిరి ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా పొదిలి మార్గమధ్యమంలో మృతి చెందింది. ఉప్పు రమాదేవికి భర్తతోపాటు ఇద్దరు ఆడపిల్లలు ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-పామూరు : శాంతి భద్రతల పరిరక్షణ కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని సిఐ రామ నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో వేకువ జాము నుండి స్థానిక ఎస్సై మధుబాబు, సిఎస్పురం, వెలిగండ్ల ఎస్ఐలు పోలీస్ సిబ్బందితో కలిసి సిఐ రామనాయక్ పట్టణంలోని ఎర్రసైలు, అబ్దుల్ కలాం సెంటర్‌లలో కార్డెన్ చర్చ్ నిర్వహించారు. అనుమానస్పద ప్రదేశాలలో తనిఖీలు చేశారు. దీంతో ఏదో జరుగుతుందని ప్రజలు ఉనికిపాటుకు గురయ్యారు. సరియైన ధ్రువ పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గుమిగూడిన ప్రజలను ఉద్దేశించి సిఐ రామనాయిక్ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ, శాంతి భద్రతలు కాపాడుట కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సర్కిల్ పరిధిలో నిఘా పెంచామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీ ఆర్‌డీసీ ఫలితాల్లో 'శ్రీ ప్రతిభ' ప్రభంజనం

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ 2024 పరీక్షా ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థలకు చెందిన గుమ్మ వెంగళ సురేంద్రబాబు రాష్ట్రస్థాయిలో 51 వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణములో ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ విద్యార్థిని అభినందించారు.

దివ్యాంగ విద్యార్థులను.. నూరుశాతం గుర్తించాలి

విశాలాంధ్ర-దొనకొండ: జూన్ 9వ తేదీలోపు గ్రామాల్లో దివ్యాంగ విద్యార్థులను నూరు శాతం గుర్తించాలని సమగ్ర శిక్ష ఏఎండి, ఐఈ కోఆర్డినేటర్ యం.రమేష్ తెలిపారు. మండలంలోని ఇంద్లచెరువు గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వేను ఆయన బుధవారం పరిశీలించి పలు సూచన, సలహాలందించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్‌పీలతో సమావేశం ఏర్పాటు చేసి ఓఎస్‌సీ సర్వేపై వివరాలు సేకరించారు. అనంతరం విద్యా కానుక గోడౌన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 షేక్. అమీర్, ఐఈఆర్‌టీలు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్న..నకిలీ విత్తనాలతో జాగ్రత్త

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ఇటీవల మండలంలో చెదురు మొదురు వర్షాలు పొలాలలో కొంతమేరకు పదును అయ్యాయి. కొందరు రైతులు పత్తి పంటలు సాగు చేసే అవకాశాలు వున్నాయి. తొలకరి పలకరించటంతో ఖరీఫ్‌లో రైతులను ఆకట్టుకునేందుకు పలు విత్తనాల కంపెనీలు గ్రామాలలో విస్తృత ప్రచారం చేస్తున్నాయి. అన్నదాత జాగ్రత్తగా లేకుంటే నకిలీ విత్తనాలతో నష్టపోయే ప్రమాదం ఉంది. తొలకరి పలకరించటంతో పాటు ఖరీఫ్ సీజన్ ప్రారంభ మౌతున్న నేపథ్యంలో అసలు విత్తనాలతో పాటు నకిలీ విత్తనాలు కూడా రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. గ్రామంలోని కొందరు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. గ్రామాల్లోప్రచార రథాలు, పోస్టర్లు వేయడంతో పాటు తమ కంపెనీ విత్తనాలు కొనండి, అన్నిటికంటే నాణ్యమైనవి, అధిక దిగుబడి వస్తుందని, గతేడాది గ్రామాల్లో ఫలానా రైతులు తమ కంపెనీల వాడారనే తప్పుడు ప్రచారాలు చేసి రైతులను నమ్మిస్తున్నారు. దీంతో అభం శుభం తెలియని రైతులు వారి మాటలు నమ్మి మోసపోయే పరిస్థితి నెలకొంది. మండలంలోని చాలా వరకు పత్తిని ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్నారు. గతంలో మండలంలోని కొన్ని గ్రామాల్లో ఎక్కడో ఇతర ప్రాంతాల్లో విత్తనాలు కొని ఎటువంటి ప్రతాలు లేకపోవడంతో అవి నకిలీవని తేలినా కూడా వారికి నష్ట పరిహారం దాఖలాలు లేవు. అధికారులు నకిలీ విత్తనాలపై కొరడా ఝళిపించాలని అన్నదాతులు కోరుతున్నారు. పత్తి సాగుపై ఆసక్తిగా గతేడాది పత్తి రైతులు ప్రతికూల వాతావరణంతో పాటు తెగుళ్లు, గిట్టుబాటు ధరలు లేక నష్టపోవడంతో ఈ ఏడాది కొంతమేరకు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులను అధికారులు కోరుకున్నారు. ఈ ఏడాది మండలంలో 2 వేల హెక్టార్లలో పంట సాగు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు ముందుగా పొలాలను శుభ్రం చేస్తున్నారు. ఏ రకం పత్తి విత్తనం కొనాలని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత బీటీ పత్తి విత్తనాల్లో రకాలు వస్తున్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకొని విత్తనాలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

పవన్ కళ్యాణ్‌ను ఐక్యరాజ్యసమితిలో ప్రసంగానికి ఆహ్వానించటం హర్షణీయం

కొక్కిరాల సంజీవకుమార్

విశాలాంధ్ర-ఒంగోలు : పవన్ కళ్యాణ్‌ను ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించేందుకు ఆహ్వానించటంపై ప్రకాశం జిల్లా, కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కాపు సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంజీవకుమార్ మాట్లాడుతూ సమాజం కులం కోసం కాదు... కులం సమాజం కోసం అంటూ కొణిదెల పవన్ కళ్యాణ్ ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించుటకు ఆహ్వానం రావటం అత్యంత అరుదైన ఈఅవకాశం వచ్చి నందుకు శుభాకాంక్షలు తెలిపారు. కాపు నాయకులు, జనసేన నాయకులు బి.రామ్ రాజ్ కుమార్, వుమ్మడిశెట్టి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి, పాలెం సురేష్ బాబు మాట్లాడుతూ భారతదేశం, ఆంధ్రప్రదేశ్ కాపు కులంలో పుట్టిన అత్యంత ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన,నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన కొణిదెల పవన్ కళ్యాణ్‌కి ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించుటకు అవకాశం దక్కటం యావత్ ప్రపంచ దేశాలు మరియు కాపు జాతి గర్వించదగ్గ విషయమని తెలిపారు. ప్రపంచం గుర్తించింది అనడానికి ఇది ఒక నిదర్శనం, దేశం కోసం పాటు పడే నాయకులు, దేశ ప్రజలకు తోడుగా ఉండి దేశ ప్రగతికి తోడ్పాటు నందించగల వ్యక్తులలో ఒకరైనందుకు, మనం రాజకీయాలలో ఆయనకు అండగా నిలిస్తే కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుందని, తద్వారా దేశం సుభిక్షంగా ఉంటుందని వక్తలు కొనియాడి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రెస్ మీట్‌లో కాపు లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, కాపు నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, శ్రీపతి సుబ్బయ్య, చెన్నంశెట్టి శివ, మల్లెల చెన్నకేశవులు, పోకల రాంబాబు, తాటి ఆంజనేయులు, రావెళ్ల వెంకట్రావు, శనగల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వెల్లడి

విశాలాంధ్ర-ఒంగోలు : త్వరలో ఒంగోలు నగరంలో ఉన్న ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు పిల్లలకు ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాలు ఇవ్వనున్నట్లు అసోసియేషన్ వెల్లడించింది. త్వరలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ లోపు చదివే విద్యార్థి, విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు: 9182095153, 9000451933లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ లోపు పై నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించాలని జర్నలిస్టు సోదరులకు అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

కార్పొరేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్



విశాలాంధ్ర-కనిగిరి : విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముందస్తు అడ్మిషన్లు చేసుకోవడంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం స్థానిక దర్శి చెంచయ్య భవనంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఉల్లంఘిస్తూ విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు కోసం విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ధనార్జన ధ్యేయంగా అడ్మిషన్లు చేస్తున్నాయని అన్నారు .ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఎటువంటి బుక్స్ గాని యూనిఫామ్ గాని విద్యాసంస్థల విక్రయించరాదని, ఆ విధముగా విక్రయించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థు చట్టాన్ని ప్రకారం కొనసాగాలని పరిమితంగా అడ్మిషన్లు చేయాలని అధిక ఫీజులను అరికట్టాలని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునివ్వడం జరిగినది.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

- సిఐ సోమశేఖర్

విశాలాంధ్ర - చీరాల : ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతుందని ఎన్నికల కౌంటింగ్‌కి ముందు కానీ తరువాత కానీ ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సిఐ సోమశేఖర్ అన్నారు. బుధవారం చీరాల మునిసిపాలిటి పరిధిలోని శృంగార పేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డన్ సెర్చ్‌లో భాగంగా వాహనలను తనిఖీ చేశామని,శృంగార పేట ఏరియా పరిధిలో ప్రతి ఇంటిని సోదా చేశామన్నారు.శృంగారపేటలోని ఇంటి ఆవరణలో పెట్రోల్,డిజిల్,కర్రలు, రాళ్ళు లాంటివి ఏమైనా ఉన్నయా అని పరిశీలించామని,రౌడీ షీటర్స్ ఇళ్లకు వెళ్లి వారి ఇంటి వద్దనే కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు.ఎన్నికల లెక్కింపు ముందు తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సహించేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగకుండా చూసుకోవాల్సిన భాధ్యత ప్రజలందరి మీద ఉందన్నారు.ఎవరైనా దాడులకు పాల్పడే అవకాశం ఉంటే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయాలని ప్రజలను కోరారు.పోలీసు అధికారుల ఉత్తర్వులను అతిక్రమించి ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సదరు వ్యక్తుల మీద కేసులు నమోదు చేయడమే కాకుండా రౌడీ షీట్స్‌ను ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అదనపు బలగాలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు:మండలంలోని నూతలపాడులో గల ఆశ్రయ వృద్ధాశ్రమంలో బుధవారం పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగభైరు వంశీకృష్ణ, గాయత్రి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిరాశ్రయులకు చేయూత ఇవ్వాలనే సంకల్పంతో వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు,పండ్లు రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు పంపిణీ చేసారు. ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి రోటరీ ప్రతినిధులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, ప్రతినిధులు బి.రాజగోపాలరెడ్డి, కారుమూడి సుబ్బారెడ్డి, వెంకన్న ఉన్నారు.

నేడు స్వామివార్ల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-పర్చూరు:మండలంలోని చెరుకూరులో వేంచేసియున్న శ్రీత్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం గురువారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ప్రకటనలో తెలిపారు. భక్తులు అధికంగా ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివార్ల తీర్థప్రసాదములు స్వీకరించాలని కోరారు.

వలంటీర్ పోస్టులు ఖాళీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 66 వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పరిపాలన అధికారి శ్రీనివాస రావు తెలిపారు.ఇందులో 65 మంది వివిధ కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు.నూతన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

వీరాంజనేయ స్వామికి సింధూర లేపన పూజ

విశాలాంధ్ర - వేమూరు : మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం వార్షిక హనుమజ్జయంతి ఉత్సవ కైకర్యాదులను ప్రారంభించారు.వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఏకాదశి దీక్షతో ఉత్సవాలు నిర్వహించేందుకు సంకల్పించారు. తొలి రోజున విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచన స్వామివారికి పంచామృత అభిషేకం జరిపి మూలవిరాట్కు సింధూర లేపన పూజ జరిపారు. పండిత దివి లక్ష్మీనరసింహాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన క్రతువులో అర్చకులు శ్రీనివాసమూర్తి పంచ సూక్తాలు మన్యుసూక్తం నారాయణ సూక్తం పారాయణ చేశారు.సాయంత్రం స్వామివారికి అష్టోత్తర శతనామా లు సహస్రనామాలతో గులాబీ పుష్ప పూజ జరిపారు.ఆంజనేయ భక్త సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణ జరిపి భజన కీర్తనలు ఆలపించారు, పల్లకి ఉత్సవం జరిపారు.చల్లగుండ్ల చిన్న బంగారు బాబు, గుంటూరు వెంకట్రావు, తలసిల గంగాధరరావు, గాదంశెట్టి వెంకట బదరీ సూర్య నారాయణ, చల్లగుండ్ల నారాయణరావు దంపతులు ఉత్సవ దాతలుగా వ్యవహరించారు.అర్చకులు అగ్నిహోత్రం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులు తక్షణమే విచారించాలి

- హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిలర్ పీపుల్స్ ప్రతినిధులు డిమాండ్

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్‌లో మిస్సింగ్ కేసులపై త్వరితగతిన దర్యాప్తు జరిపించాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ పీపుల్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మిస్సింగ్ కేసులు పెరిగిపోతున్న తరుణంలో దానిని పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. మిస్సింగ్ కేసులను కాలయాపన చేయకుండా వేగవంతంగా దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని పీపుల్స్ టీమ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మానవ హక్కులకు ఆర్టికల్ 12 నుంచి 31 వరకు వీటికి ఏ భంగం జరిగినా తక్షణమే మేము ప్రజా సేవకు స్పందిస్తామని మీ సేవకు మేము ఎప్పుడు ఏ సమస్య జరిగిన మా టీమ్ దృష్టికి తీసుకురావాలని ప్రజలను ప్రతినిధులు కోరారు. న్యాయమైన సమస్యలకు హ్యూమన్ రైట్స్ ఎప్పుడు అందదండగా ఉంటారని రాష్ట్రంలో ఉన్న మిస్సింగ్ కేసుల మీద అన్ని పోలీస్ స్టేషన్‌లకు వెళ్లి కలవడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. అలా ప్రతి ప్రజా సమస్యకు ఎప్పుడు అండదండగా ఉంటామని వారు తెలిపారు. ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ పీపుల్స్ నేషనల్ వైస్‌చైర్మన్ ఎన్. చంద్రశేఖర్ బాబు,నేషనల్ కో-ఆర్డినేటర్ పి. సాంబశివరావు,యన్నం సురేష్,జుజ్జువరపు సురేష్,నాగ లింగేశ్వరరావులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

విశాలాంధ్ర - యద్దనపూడి : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది.మండలంలో పోలూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వినోద్ కుమార్ (36) దర్శి గ్రామం గవర్నమెంట్ పాఠశాలలో పనిచేస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.ఏపీ 40 క్యూ 5273 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై పోలూరు వెళుతుండగా యద్దన పూడి,పోలూరు గ్రామాల మధ్య రోడ్డు గుంతలు పడిన కారణంగా గుంతలు తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.సమాచారం తెలుసుకున్న యద్దనపూడి ఎస్సై జి. వెంకటేశ్వరరావు చౌదరి ప్రమాద స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.వినోద్ కుమార్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యా యులు వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విజయవంతంగా కార్నియా ట్రాన్స్ ప్లాంటేషన్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలోని ఎల్వి ప్రసాద్ కొమ్మారెడ్డి రాజా రామ్ మోహనరావు కంటి ఆసుపత్రిలో కార్నియా ట్రాన్స్ ప్లాంటేషన్ (నల్ల గుడ్డు మార్పిడి) శస్త్ర చికిత్సను విజయ వంతంగా నిర్వహించి నట్లు వైద్య బృందం డాక్టర్ అరవింద్ రాయ్ డాక్టర్ శ్రేయ చంద్ర డాక్టర్ బన్నీ సింహాల బృందం తెలియజేశారు.తీర ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో కంటి వైద్యాన్ని అందిస్తున్న ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వారు తెలిపారు.కార్నియా ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం లక్షల ఖర్చుపెట్టి పట్టణాలలో జరగాల్సిన అవసరం లేకుండా ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఈ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు.ఈ సస్త్ర చికిత్సకు సేవలందించిన వీరవల్లి వాసుబాబు ఎన్.పిచ్చిరెడ్డి,ఎన్.రవిచంద్ర, వై.వెంకట్, ఎన్.రంజిత సిబ్బందికి అభినందనలు తెలిపారు.

తప్పిపోయిన మహిళను బంధువులకు అప్పగింత

విశాలాంధ్ర - మార్టూరు : కాశీ తీర్థయాత్రలకు వెళ్లిన తప్పిపోయిన ఇసుక దర్శి గ్రామానికి చెందిన మల్లేశ్వరిని మార్టూరు సిఐ రాజశేఖర్ రెడ్డి చొరవతో తోటి ప్రయాణికులతో చేర్పించినట్లు బాధితురాలు బంధువులు తెలిపారు.సీఐ రాజశేఖర్ రెడ్డి కథనం ప్రకారం మార్టూరు మండలం ఇసుక దర్శి గ్రామానికి చెందిన మారెళ్ళ మల్లేశ్వరి అనే మహిళ గ్రామస్తులు సుమారు 40 మంది కలిసి గత శనివారంరాత్రి ఇసుక దర్శి గ్రామం నుండి బయలుదేరి కాశీకి వెళ్లారు.బుధవారం ఉదయం 8 గంటల సమయంలో జార్ఖండ్‌లోని ఒక ప్రాంతంలో కాల కృత్యాల కోసం బస్సు ఆపారు.ఆ సమయంలో బస్సు దిగిన మల్లేశ్వరి కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం ఆమె దిగిన బస్సును గుర్తించలేక పొరపాటున వేరే బస్సు ఎక్కి ఆ ప్రాంతం నుండి ముందుకు వెళ్లనందున ఆమె వారి గ్రామస్తులతో కలిసి వచ్చిన బస్సును మిస్ అయింది.ఆవిడ వద్ద బస్సు డ్రైవర్ ఫోన్ నెంబర్ తన తోటిప్రయాణికుల ఫోన్ నెంబర్లు లేనందున,అయోమయ స్థితిలో సహాయం కొరకు చూస్తున్న దశలో,ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన వేరొక బస్సు ప్రయాణికులు ఆమెను గుర్తించి ఆమె వివరాలు కనుక్కొని గూగుల్ ద్వారా మార్టూరు పోలీస్ స్టేషన్ సీఐ నెంబర్ తెలుసుకొని,ఫోను ద్వారా బాధితురాలు మల్లేశ్వరి తప్పిపోయిన సమాచారం ఇచ్చారు. వివరాలు తెలుసుకున్న సీఐ ఎస్.వి రాజశేఖర్ రెడ్డి ఇసుక దర్శి గ్రామ మహిళా పోలీస్ ఎం.నిర్మల సహాయంతో మల్లేశ్వరి కుటుంబ సభ్యులను గుర్తించి ఆమెతో వెళ్లిన సహ ప్రయాణికుల ఫోన్ నెంబర్లు,బస్సు డ్రైవర్ ఫోన్ నెంబర్లు సేకరించి బస్సు డ్రైవర్‌ని సంప్రదించి బస్సును ఆమె ఉన్న ప్రాంతానికి తీసుకువెళ్లి ఆమెను బస్సులో ఎక్కించుకొని తోటి ప్రయాణికులకు అందరూ కలిసి తీర్థయాత్రకి వెళ్లారు. బాధితురాలు,బంధువులు పోలీసులకు సహాయం చేయుటకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీసీ కెమెరా చోరీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఈ నెల 13 వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్‌ను ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు.మండలంలోని గవినివారి పాలెం పంచాయితీ పుల్లయపాలెం పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా అపహరణకు గురి అయ్యింది.దీనిపై బీ.ఎల్.ఓ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని,నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చీరాల రూరల్ ఈపురుపాలెం ఎస్సై ఎం.వి శివకుమార్ తెలిపారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలో చేరాలి

- ఐఈఆర్ఎఫ్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - వేమూరు : ప్రత్యేక అవసరతలు కలిగిన బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో చేర్పించాలని ఐఈఆర్ఎఫ్ విజయలక్ష్మి తెలియజేశారు. బుధవారం మండలంలోని వంహపురంలో ప్రత్యేక అవసరతలు కలిగియున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.సర్వ శిక్ష అభియాన్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రత్యేక అవసరతలు కలిగిఉన్న 18 సంవత్సరాలలోపు పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు.అటువంటి వారికి విద్యాబుద్ధుల తో పాటు పరికరాలు అందించడం జరుగుతుందని వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రాజు,అంగన్వాడి కార్యకర్తలు ఉన్నారు.

అల్లర్లకు పాల్పడవద్దు

విశాలాంధ్ర-మంగళగిరి : ఎటువంటి అసంఘటిత సంఘటనలు లేకుండా ముగి సిన ఎన్నికల పోలింగ్ విధానంలోనే ప్రజలు పార్టీలకు అతీతంగా కలిసి మెలసి ఉండా లని, రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టమైన ఎన్నికల కౌంటింగ్ రోజున ఎటువంటి అల్లర్లకు పాల్పడకూడదని మంగళ గిరి రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ పెదవడ్లపూడి స్థానిక గ్రామ ప్రజలకు సూచించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపుకు కొద్ది రోజులు మాత్రమే గడువు ఉండటంతో పై అధికారుల ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాల్లో పోలీసులు ముందస్తు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. పెదవడ్లపూడి గ్రామంలో బుధవారం రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ స్థానికులను కలిసి మాట్లాడారు. అన్ని పార్టీలకు చెందిన వారు ఎన్నికల కౌంటింగ్ రోజున సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అల్లర్లకు పాల్పడవద్దని, ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఎలా సహకరించారో కౌంటింగ్ రోజున కూడా సహకరించాలని ప్రజలకు ఎస్సై క్రాంతి కిరణ్ విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అడుగులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ బోర్డులను పట్టణ సీఐ ఎం.శ్రీనివాసరావు ఏర్పాటు చేయడం జరిగింది. నగర ంలో ప్రధాన కూడలి ప్రాంతాలైన ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు, పాత బస్టాండు, తెనాలి వెళ్లే రోడ్డు, రాజీవ్ గృహ కల్ప రోడ్ ఆంజనేయ స్వామి దేవాలయం ఎదురుగా, ఆటోనగర్ ఆర్టీసీ గ్యారేజీ వెళ్లే రోడ్డు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ట్రాఫిక్ బోర్డులను సీఐ ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ఎం నుంచి వచ్చే బస్సులు పాత బస్టాండ్ వద్ద కాకుండా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి యూ టర్నింగ్ తీసుకోవా లని సీఐ వారికి తెలియజేశారు. అదేవిధంగా మెయిన్ బజార్, మిద్దె సెంటర్ వద్ద కూడా ట్రాఫిక్ బోర్డులను ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీసు వారు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బోర్డులను అనుసరించి వాటి ప్రకారం నడుచుకోవాలని, పట్టణ పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ ఎం. శ్రీనివాసరావు కోరారు.

కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

విశాలాంధ్ర-తాడేపల్లి : జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు నేపధ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించే చర్యల్లో భాగంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశా లు మేరకు బుధవారం తాడేపల్లి పట్టణంలోని సీతానగరం ప్రాంతంలో తాడేపల్లి సీఐ, ఎస్ఐలు వంద మంది సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా ముందస్తు చర్యల్లో భాగంగా 100 మంది పోలీసులతో తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరైన పత్రాలు చూపించని 15 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో గుంటూరు పార్లమెంటు నియోజక వర్గం, ఏడు శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను బుధవారం సాయం త్రం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. వేణుగోపాల్‌రెడ్డి, జిల్లాఎస్పీ తుషార్ డూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) స్వప్నిల్ జగన్నాథ్, గుం టూరు ఆర్డిఓ శ్రీకర్, నియో జకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా ఆచార్య నాగార్జున యూని వర్సిటీలో డైక్‌మెన్ ఆడిటోరి యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులకు మీడియా సెంటర్ కొరకు ఏర్పాటు చేయు హాల్‌ను పరి శీలించి తగు సూచనలు జారీ చేశా రు. తదుపరి ఏఎన్ యూలో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రి యకు హాజరయ్యే ప్రభుత్వ సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లు, అభ్యర్థుల వాహనాల పా ర్కింగ్ స్థలం కొరకు యూనివర్సిటీలో స్థలాన్ని పరిశీలించారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఏఆర్ఓ భీమారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజలక్ష్మి పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై అధ్యయనం చేయాలి

- కమిషనర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధి విధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయ నం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరిగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్ఓ మాట్లా డుతూ, జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, విధులు కేటా యించబడిన అధికారులు ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ మార్గదర్శ కాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపులో తొలుతగా పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్ఓలు, ఏఆర్ఓలు తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన వారు తప్పనిసరిగా ఐడి కార్డ్‌లు ధరించాలని, కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్ ఫోన్ అనుమతి లేనందున సెల్ ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిఈఈని ఆదేశిం చారు. అలాగే కౌంటింగ్ కేంద్రంలో తగిన టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూ టర్లు, ఆపరేటర్లు ఉండేలా పర్యవేక్షణ చేయాలని ఈఈనిని, విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించాలని డిఈఈని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుండి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికా రులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలని, అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను చెక్ లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని మేనేజర్ ని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకట లక్ష్మీ, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, డిఈఈ రమేష్ బాబు, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

7 వరకు ఉచిత సమ్మర్ క్యాంప్‌లు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు జూన్ 7వ తేదీ వరకు నిర్వ హిస్తున్న ఉచిత సమ్మర్ క్యాం ప్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బ రత్నమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుబ్బ రత్నమ్మ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 98 శాఖ గ్రంథాలయాలో ఉచిత సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కథలు చదవడం, కథలు చెప్పడం, సొంత కథలు రాయడం, డ్రాయి ంగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్ ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ అందించి ప్రతివారం విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌కు ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్ల లను గ్రంథాలయాలకు పంపించి ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ అధికారి బి.శకుంతల, గ్రంథాలయ సిబ్బంది పి.కోటేశ్వరి, సీహెచ్.లక్ష్మీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

నాటక పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని వరగాని గ్రామంలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనిమిదవ ఆహ్వాన నాటిక పోటీలు అరవపల్లి వీరరాఘ వయ్య కళా ప్రాంగణం నందు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ నాటిక పోటీలను వడ్లమాని రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి సందేశాన్నిచ్చే ఇటు వంటి నాటికలు నిర్వహించటం అభినందనీయమ న్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ఈ నాటికి పోటీ లను నిర్వహిస్తున్న పరిషత్ అధ్యక్షుడు పోపు నాగేశ్వరరావుని ఆమె అభి నందించారు. తొలుత ఈ పోటీలలో ఇంద్రప్రస్థ నాటకాన్ని ప్రదర్శిం చారు. ప్రేమ మోజులో పడి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే యువత యువకులకు ఈ నాటకం ద్వారా అందించిన సందేశం ప్రేక్షకు లను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ లాటరీ మాంక్ వడ్లమాని రవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షులు రాఘవయ్య, రోటరీ ఎలెక్ట్ గవర్నర్ రాంప్రసాద్, కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు బండరాంబాబు, కొర్లపాటి రామా రావు, చెన్నుపాటి సురేంద్ర, పెదనం దిపాడు రోటరీ క్లబ్ అధ్యక్షులు కోదండరామిరెడ్డి, కార్యదర్శి వై రమ ణయ్య (రమణ), రోటేరియన్స్ కొల్లా సాంబశివరావు, పోపూరి లక్ష్మీ నారా యణ, జాగర్లమూడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో ఈత ఉత్సాహం

విశాలాంధ్ర-తాడేపల్లి : వేసవి ఎండల తాపంతో ఉండవల్లి కృష్ణానది కరకట్ట వెంబడి వీడబ్ల్యూటీ వర్క్ షాప్ పక్కన కృష్ణానదిలో బుధ వారం ఉదయం యువకులు, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా ఈత కొడుతూ సేద తీరుతున్నారు. వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు పిల్లలను తమతో పాటు తీసుకువచ్చి ఈత నేర్పుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఆకట్టుకున్న పోలీసుల మాక్ డ్రిల్

విశాలాంధ్ర-మార్కాపురం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వచ్చే జూన్ 4వ తేది జరుగనున్న కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలోని గడియారం స్థంభం సెంటర్ వద్ద పోలీస్ సిబ్బందితో బుధవారం 'మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్స్ కార్యక్రమం జరిగింది. ఈ మాక్ డ్రిల్స్ పట్టణ ప్రజలను బాగా ఆకట్టుకుంది. శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడినప్పుడు వాటిని ఏ విధంగా సమర్థవంతంగా ఎదుర్కోవాలో మాక్ డ్రిల్‌లో పోలీసులు ప్రదర్శించిన తీరు అందరిని ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా డిఎస్పీ బాల సుందరరావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు ఎవరైనా పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా ఏ విధంగా అయితే సహకరించారో కౌంటింగ్ రోజు కూడా అలాగే సహకరించాలని

అన్ని వర్గాల ప్రజలను ఆయన కోరారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని ఈ సందర్భంగా సహకరించిన ప్రజలకు డిఎస్పీ బాలసుందర్రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ ఎస్‌కె అబ్దుల్ రహిమాన్, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు సీపీఐ వినతి పత్రం

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినుకొండ టౌన్ ఎసై కత్తి స్వర్ణలతకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ వినుకొండ నియోజకవర్గం సమితి నాయకులు ఈ సందర్భంగా సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లా డుతూ వినుకొండ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుండి మార్కాపురం రోడ్డు చెక్ పోస్టు దాకా, బోసుబొమ్మ సెంటర్ నుండి ఏనుగుపాలెం రైల్వే గేటు దాకా, శివయ్య స్థూపం దగ్గర నుండి మున్సిపల్ ఆఫీస్ దాకా, ఆంధ్ర బ్యాంకు, స్టేట్ బ్యాంకు, లాయర్ స్ట్రీట్ ఏరియాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నడిరోడ్డు మీదే బాటసారులు మోటార్ సైకిల్ ఆపి ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని ఆటోలు చిరు వ్యాపారులు నాలుగు చక్రాల బండ్లు వారు రోడ్లకు అడ్డంగా వాహనాల ఆపి ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, అదేమని ప్రజలు ప్రశ్నిస్తే వారిపైన తిరుగుబడుతున్నారని కనీసం అంబులెన్స్ రావడానికి కూడా దారి ఇవ్వకుండా నడిరోడ్లపై వాహనాలు నిలిపి ప్రజలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని పోలీసు వారు వెంటనే స్పందించి వినుకొండ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ వినుకొండ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సీపీఐ నాయకులు పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జున, సోమవరపు దావీదు, ఎస్. కె మస్తాన్‌వలి , ధారా సాంబయ్య, భాస్కర్, అనీలు, తదితరులు పాల్గొన్నారు.

జనన,మరణ పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి:మునిసిపల్ కమిషనర్

విశాలాంధ్ర - చీరాల : జనన,మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి 2023 అక్టోబరు 1 నుండి అమల్లోకి వచ్చిన కొత్త విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చీరాల మునిసిపల్ కమీషనర్ కె.చక్రవర్తి అన్నారు.చీరాల మునిసిపల్ కార్యాలయంలో చీరాల పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లు సిబ్బందికి అవగాహన సమావేశము నిర్వహించారు. ఈ సంధర్బంగా కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జనన మరణాలకు సంబంధించి వివరాలు జాగ్రత్తగా నమోదు చెయ్యాలన్నారు. పటట్టణంలో డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణంలో మురుగు, వర్షపు నీరు ఎక్కడా నిల్వ లేకుండా చేయాలన్నారు,ఫాగింగు, యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని, ఫ్రైడే-డ్రైడే చేపట్టాలని,పట్టణ ప్రజలకు డెంగ్యూ వ్యాధి పై అవగాహన కల్పించి,డెంగ్యూ ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, జనన, మరణ విభాగపు సిబ్బంది, ప్రైవేట్ హాస్పిటల్స్ సిబ్బంది, శానిటరీ ఇనిస్పెక్టర్ ,హెల్త్ సెక్రటరీలు,వార్డు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధోశక్తిని పెంపొందించాలి

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరు గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ పాలకులు పిజే రామారావు దేశభక్తి గీతాలు చదివించి వాటి గురించి వివరించారు.నీతి కథలు పంచతంత్ర కథలు విద్యార్థుల చదివించి వాటి సారాంశంను వివరించారు.విద్యార్థులకు చెస్ బోర్డ్ ఆటలు ఆడించి విద్యల్లో విద్యార్థుల్లో మేధోశక్తిని పెంపొందించేందుకు కృషి చేశారు.విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పట్టణానికి చెందిన న్యాయవాది చప్పరం శ్రీనివాసులు (వాసు) జన్మదిన సందర్భంగా బుధవారం చిన్ననాటి స్నేహితులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసును ఆయన స్వగృహంలో స్నేహితులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి తినిపించారు. వాసు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు తడికమల్ల వెంకటేశ్వర్లు, కొలిపర్తి మారుతి కుమార్, మామిడి రమేష్, దరిశి బుజ్జిబాబు, పువ్వాడి శివప్రసాద్, షేక్ భారీ మామ్, కొప్పరపు సత్యాలు, దరిశి సుబ్రహ్మణ్యం, అద్దంకి రంగబాబు, అద్దంకి బాల రంగా, కోటా శ్రీనివాసులు, కోట కొండలు, విజయ్ కుమార్, ఒగ్గు రాము పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

◆ జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లట్కార్

విశాలాంధ్ర-నరసరావుపేట : సార్వత్రిక ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ నియోజక వర్గాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి లట్కార్ అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కార్యకర్తలకు కూడా సూచించాలని కోరారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రధాన పార్టీలు వారి వారి ఏజెంట్లను నియమాకానికై ఫామ్-18ల ద్వారా రెండు సేట్లను త్వరితగతిని అందించాలన్నారు. ఒక సెట్‌ను పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి పంపించి వెరిఫై చేయడం జరుగుతుందన్నారు. ఎటువంటి కేసులు లేని వారిని మాత్రమే ఏజెంట్‌గా నియమించడం జరుగుతుందన్నారు. జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల లోపు ఎవరి వాహనాలకు అనుమతులు లేవని ఆయన అన్నారు. గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. జేఎన్టీయూ మెయిన్ గేటు వద్ద 24 గంటలు పనిచేసే విధంగా పెద్ద స్క్రీనును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి సీసీ కెమెరాల సర్వైలెన్స్ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లు మూడు రకాలు ఉన్నాయని, ఒకటి ఉద్యోగస్తులది, రెండవది హోమ్ ఓటింగ్, మూడు సర్వీస్ ఓటర్‌లని ఆయన అన్నారు. పోస్టల్ బ్యాలెట్లు పెదకూరపాడు నియోజకవర్గానికి సంబంధించి పోలీస్ స్టేషన్లో, నియోజకవర్గానికి సంబంధించి చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో, నరసరావుపేట నియోజ కవర్గానికి సంబంధించి ట్రెజరీలో, సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించి సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్ అధీనంలో, వినుకొండ నియోజకవర్గానికి సంబంధించి వినుకొండ ట్రెజరీలో గురజాల నియోజకవర్గం సంబంధించి పోలీస్ స్టేషన్‌లో..మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి పోలీస్ స్టేషన్లో భద్రపరచడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్లన్నిటిని కట్టు దిట్టమైన భద్రత నడుమ జేఎన్టీయూ కౌంటింగ్ సెంటర్‌కు తరలించడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని, ఈవీఎంల కౌంటింగ్ కూడా మొదలవుతుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను పెట్రోల్ బంక్ వ్యాపారం చేస్తున్నాను. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాకి చెందిన ఎస్. తిమ్మారెడ్డి నుండి రిజిస్ట్రేషన్ నెంబర్ 2834 Dt: 1984లో రిజిస్ట్రేషన్ డీడ్స్ ద్వారా ఆస్తిని కొనుగోలుచేసాను, రిజిస్టర్ అథారిటీ సబ్ రిజిస్టరింగ్ ఆఫీసులో నాతల్లి చనిపోయినట్లు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీచేసింది. నేను పై డాక్యుమెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది. 15-05-2024న నా ఇంటి నుండి ఇంకొల్లు బస్టాండ్‌కి నా మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు 2834/1984 మరియు ఇతర డాక్యుమెంట్లు ఉన్న బ్యాగ్ పోయినది. ఎంత వెతికినను కనిపించలేదు దీనిపై ఇంకొల్లు పోలీసు వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. ఎవరికైనా ఈ డాక్యుమెంటుల దొరికిన యెడల సదరు డాక్యుమెంట్లను ఇంకొల్లు పోలీసు వారికి గాని క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

బెల్లంకొండ వాసుదేవరావు
S/o.Late సుబ్బారాయుడు, ఇంకొల్లు(మం),బాపట్ల జిల్లా.

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను పెట్రోల్ బంక్ వ్యాపారం చేస్తున్నాను. మా అమ్మ జీవించి ఉన్నప్పుడే, మా అమ్మ నాకు రిజిస్ట్రేషను సర్టిఫికేట్ జారీ చేసిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎస్.తిమ్మారెడ్డి నుండి రిజిస్టర్ డీడ్ నెం: 2828, 3153,2829 Dt:1984 ద్వారా ఆస్తిని కొనుగోలుచేసింది. తదనంతరం, నా వద్ద ఉన్న నా తల్లి గారు మరణించినారు. నేను సదరు డాక్యు మెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది. 15-05-2024న నా మోటార్ సైకిల్‌పై నా ఇంటి నుండి ఇంకొల్లు బస్ స్టాండ్‌కు వెళుతుండగా, రిజిస్ట్రేషన్ డీడ్‌ల సంఖ్య: 2828/1984, 3153/1984, 2829/1984 డాక్యుమెంట్లు, ఇతర పత్రాలు ఉన్న బ్యాగ్ పోయినది. దీనిపై అనంతరం ఎంత వెతికిననూ కనిపించలేదు. దీనిపై ఇంకొల్లు పోలీస్ వారికి కూడా ఫిర్యాదు చేయడంజరిగినది. పై డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికిన యెడల ఇంకొల్లు పోలీసు వారికి గాని క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

బెల్లంకొండ వాసుదేవరావు
S/o.Late సుబ్బారాయుడు, ఇంకొల్లు(మం),బాపట్ల జిల్లా.

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను గృహిణిని, నేను రిజిస్టర్డ్ డీడ్‌ల ద్వారా ఆస్తిని కొనుగోలు చేసాను. రిజిస్ట్రేషన్ నెంబర్ 2838 Dt:1984, హైదరాబాద్ రంగారెడ్డికి చెందిన S.తిమ్మారెడ్డి నుండి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రిజిస్టరింగ్ అథారిటీ వద్ద అస్తికి సంబంధించి నాకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీచేసింది, తదనంతరం,నావద్ద ఉన్న నాతల్లిగారు మరణించినారు. అయితే సదరు డాక్యుమెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది:15-05-2024న నా ఇంటి నుండి మోటార్ సైకిల్‌పై ఇంకొల్లు బస్ స్టాండుకు వెళుతుండగా, రిజిస్ట్రేషన్ డీడ్ నెంబర్: 2838/1984 మరియు ఇతర డాక్యుమెంట్‌లు ఉన్న నా బ్యాగు పోయినది. అనంతరం ఎంత వెతికినను కనిపించలేదు దీనిపై ఇంకొల్లు పోలీసు వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. కావున సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల ఇంకొల్లు పోలీసు వారికి గాని క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

దేసు కన్యాకుమారి,
W/o. Late కోటీ స్వామి, ఇంకొల్లు(మం), బాపట్ల జిల్లా,

ప్రణాళిక బద్ధంగా అధ్యయనం చేయాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

విశాలాంధ్ర - చీరాల : గ్రూప్-2 మెయిన్స్‌కి ఎంపికైన అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా అధ్యయనం చేసి తమ లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్సీ కే.ఎస్ లక్ష్మణరావు అన్నారు.గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష రాసి మెయిన్స్‌కి అర్హత సాధించిన అభ్యర్థులకు సెయింట్ మార్క్స్ లూథరన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల,వివిధ సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులలో బుధవారం భారత రాజకీయ వ్యవస్థలో మొదటి భాగమైన భారత రాజ్యాంగంను ఎమ్మెల్సీ లక్ష్మణరావు బోధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్స్ పరీక్షలో 300 మార్కులకు ఇండియన్ పాలిటి సబ్జెక్టు 75 మార్కులకు ప్రశ్నలు ఉంటాయని ప్రణాళిక బద్ధంగా అధ్యయనం చేస్తే ఈ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించవచ్చున్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్లు ఉన్న పోస్టులకు పోటీ పడడంతో పాటు ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాల భర్తీ గురించి కూడా మాట్లాడాలని అవసరమైతే పోరాడాలని తెలిపారు.తాము ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్సీలుగా ఖాళీగా ఉన్న డీఎస్సీ బ్యాక్ లాగ్,ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతున్నామన్నారు.ఎంతో వ్యయ ప్రయాసలతో ఈ తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.తరగతులకు హాజరైన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ చరిత్ర అనే 500 పేజీల పుస్తకాన్ని ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపల్ జి.పుష్ప రాజు,పి.జయశీలరావు, డిబిఆర్‌సి కో-ఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలో పూడికతీత

విశాలాంధ్ర - బల్లికురవ : ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగరీత్యా రాష్ట్రాలు దాటి వెళ్ళినప్పటికీ సొంత ఊరుపై ఉన్న మమకారంతో సొంత గ్రామాలకు ఎంతో కొంత సేవ చేయాలని లక్ష్యంతో కొందరు యువకులు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఏర్పాటుచేసి గ్రామాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మన గ్రామం మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గుంటుపల్లి,కొత్తపాలెం గ్రామాలలోని పంట పొలాలకు నీళ్లు వెళ్లే కాలువ పూడికతి పనులు బుధవారం ప్రారంభించారు.ఈ పంట కాలవ ద్వారా సుమారు 250 ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) నాట్స్ ప్రెసిడెంట్ నూతి బాపయ్య చౌదరి కాలవ పూడికతీత పనులను దగ్గరుండి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఆయనను ఘనంగా సత్కరించారు.బాపు మాట్లాడుతూ గ్రామాలలో తమకు చేతనైన సహాయ సహకారాలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.త్వరలోనే మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న నోట్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మాదాల రాజేంద్ర బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంటుపల్లి ఎంపీటీసీ దూళిపాల శ్రావణి పున్నారావు,మలినీడి గోవిందరావు,మాదాల సాంబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు



విశాలాంధ్ర - అద్దంకి : గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా బుధవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ క్విజ్ పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.పోటీలలో గెలుపొందిన విజేతలకు గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు బహుమతులను పంపిణీ చేశారు.శిక్షణా తరగతులకు ఫ్యాకల్టీగా స్థానిక సాయి పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ వీర్రాజు వ్యవహరించారు.

రేపల్లెలో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

◆ పట్టించుకోని మునిసిపల్ అధికారులు
◆ దుర్గంధంతో పట్టణ వాసులు బెంబేలు

విశాలాంధ్ర - రేపల్లె : గత కొద్ది రోజులుగా రేపల్లె పట్టణంలో ఏ వార్డులో చూసిన చెత్త కుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తూ పారిశుధ్యం క్షీణిస్తున్న పరిస్థితులు రేపల్లె పట్టణంలో నెలకొంది. చెత్త కుండీలు నిండి వ్యర్థ పదార్థాలు చెత్త పేరుకుపోయి కిందపడి కుప్పలు కుప్పలుగా ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి.ప్రధాన రహదారులతో పాటు వార్డుల్లో వీధి చివర వార్డుల సేకరించిన చెత్తను కుప్పలు కుప్పలుగా పారిశుధ్య కార్మికులు పోసి చేతులు దులుపుకుంటున్నారు.ఎన్నికలు పూర్తయి నప్పటికీ సంబంధిత మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇంకా విధుల్లోకి చేరకపోవడంతో రోడ్లపై చెత్త ఎక్కడ చూసినా వ్యర్థ పదార్థాలు,ప్లాస్టిక్ కవర్లు,గ్లాసులు,చిత్తు కాగితాలు,రోడ్లు మీద ప్రధాన రహదారుల మీద ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఏర్పాటు చేసిన చెత్త కుండీలలో నిండిపోయి రోడ్లపై చిందరవందరగా పడిపోయి ఈదురు గాలులకు చెత్త రోడ్లపై నుండి ఎగిరి పడుతూ సమీపంలోని గృహాలు, వ్యాపార దుకాణాల ముందు పడిపోవడం పట్ల ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.దీనివలన దుర్గంధం వెదజోల్లుతోంది. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతూ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.మురుగు కాల్వల్లో దోమల నివారణ మందులు స్ప్రే చేసి ఎంతకాలమైందో మున్సిపల్ పాలకులకు అధికారులకే తెలుసు.బ్లీచింగ్, దోమల నివారణ మందు, చల్లడంలో మున్సిపల్ అధికారులు పాలకులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.స్వచ్ఛ రేపల్లె అంటే ఇదేనా అని మున్సిపల్ పాలకులను అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి క్షీణిస్తున్న పారిశుధ్యం మెరుగుపరచాలని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పడి ఉన్న కుప్పలు కుప్పలుగా ఉన్న చెత్త చెదారాన్ని వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని,దోమల నివారణ మందులు స్ప్రే చేసి పట్టణ ప్రజలు దోమ కాటు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని రేపల్లె పట్టణ ప్రజలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు.

సామాజిక చైతన్యం కోసమే నాటక పోటీలు

- కందిమల్ల సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : సందేశాత్మమైన నాటికలను నిర్వహించి సమాజంలో సామాజిక చైతన్యం కోసం నాటక రంగాన్ని ప్రోత్సహించాలని కందిమల్ల సాంబ శివరావు అన్నారు.మార్టూరులోని ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈనెల 27,28, 29న శ్రీకారం,రోటరీ కళా పరిషత్ ఆధ్వర్యంలో 14వ వార్షిక తెలుగు రాష్ట్రాల నాటకల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుండి శ్రీకారం,రోటరీ క్లబ్ మార్టూరు వారి సౌజన్యంతో నాటక పోటీలు నిర్వహిస్తున్నారని ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం మార్టూరులోనే అన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చు అని తెలిపారు. 27న మొదటి రోజు విజయవాడ వార నాన్న నేనొచ్చేస్తా ,రెండవ ప్రదర్శనగా తెలుగు కళా సమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదేంత,మూడవ ప్రదర్శనగా కళానికేతన్ వీరన్నపాలెం వారి రాజు గారి గోచి 28న రెండవ రోజు మొదటి ప్రదర్శనగా శ్రీకారం రోటరీ కళా పరిషత్ మార్టూరు వారి రైతు భారతం,రెండవ ప్రదర్శనగా రససూరి పొన్నూరువారి కాపలా, మూడవ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్ వారి రైతేరాజు,నాలుగో ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బంధం,చివరి రోజు మొదటి ప్రదర్శనగా అభినయ గుంటూరు వారి ఇంద్రప్రస్థం,రెండవ ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు నాటిక ,మూడవ ప్రదర్శనగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి కౌసల్యా సుప్రజా రామ నాలుగవ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ సమర్పించు రాత నాటికతో మూడు రోజులు నాటికలు ముగుస్తాయి.మూడు రోజులపాటు మొదటిరోజు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పి.కృష్ణయ్య హాజరవుతారు.రెండవ రోజు ముఖ్యఅతిథిగా ప్రజా కళాకారులు ప్రజానాట్య మండలి జాతీయ నాయకులు(అన్న) నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొంటారాని, మూడో రోజు ముఖ్యఅతిథిగా రోటరీ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్ రావు హాజరవుతారు.

ఈ కార్యక్ర మంలో రోటరీ అధ్యక్షులు సాంబశివరావు, ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జెవి మోహన్‌రావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు,గరిమిని శ్రీనివాసరావు, దొడ్డ రమేష్, ఖాజా హుస్సేన్, చెన్నుపాటి బసవ రాములు ఈశ్వర్ ప్రసాద్ రావి అంకమ్మ చౌదరి చెరుకూరి అంజిబాబు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు అని నిజాంపట్నం శాఖా గ్రంథాలయ అధికారి ఎన్. విజయలక్ష్మి అన్నారు.వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సైన్స్ క్లాసులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. శాఖ గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, వికాస్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై చొరవతో రహదారి మరమ్మతులు

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రమాదాలకు నిలయంగా మారిన యద్దనపూడి జాగర్లమూడి రహదారి పెద్ద పెద్ద లోడులతో టిప్పర్ల తిరగటంతో రహదారి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.రోడ్‌ను పరిశీలించిన యద్దనపూడి ఎస్సై జి.వెంకటేశ్వరచౌదరి రహదారిలోని గోతులను గ్రావెల్‌తో చదును చేయించారు.ఇటీవల రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురికావడం, ఉపాధ్యా యుడు మృతితో ఎస్సై వెంటనే స్పందించి లారీలతో గ్రావెల్‌ను తోలించి గుంతలను తన సిబ్బంది సహాయంతో చదును చేయించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు.అద్వాన రహదారికి మరమ్మతులు చేయించినందుకు పలువు రు ప్రజలు ఎస్సైని, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఐటీఐల్లో సీట్లు భర్తీ చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వ ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థ ఐటీఐల్లో సమన్వయ శాఖల సహకారంతో నూరు శాతం సీట్లు భర్తీ చేయాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.రఘు అన్నారు.ఈ అంశంపై గుంటూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఒకేషనల్ గైడెన్స్ కమిటీకి బాపట్ల,పల్నాడు జిల్లాల అధికారులు కమిటీ సభ్యులు హాజరైయ్యారు.ఈ సమావేశంలో ఉపాధి కల్పన అధికారి కె.రఘు మాట్లాడుతూ ఐటీఐ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదలైందని దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. స్వయం ఉపాధి పొందే విధంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఎంతో అవసరమన్నారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఆఫీసర్స్, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్, ప్రభుత్వ ఐటిఐ ప్రెసిపల్స్, ప్రైవేట్ ఐటిఐ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ పలు సూచనలు చేశారు.